ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులు

● మండల విద్యాధికారి నరేశం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులని మండల విద్యాధికారి నరేశం అన్నారు. సోమవారం కోరుట్ల మండలం సంగెం ప్రాథమిక పాఠశాల రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు నల్ల శంకర్‌ను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి నరేశం మాట్లాడుతూ శంకర్ ప్రధానోపాధ్యాయుడుగా ఉన్న సమయంలో ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకునేలా మార్గనిర్దేశనం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అశోక్ కుమార్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌లు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రచార పోస్టర్లను సోమవారం వారు వేర్వేరుగా ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఫైర్ సేఫ్టీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గృహ నిర్మాణాలు, స్కూల్, వ్యాపార సముదాల అనుమతుల్లో అగ్ని ప్రమాద నివారణ చర్యలు చేపట్టిన అనంతరమే అనుమతులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారులు కృష్ణ కాంత్, రవీందర్, మధు తదితరులు ఉన్నారు.

కూరగాయల సాగుపై అవగాహన



పాల్గొన్న రైతులు, అధికారులు

కొడిమ్యాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్ రైతు వేదికలో సోమవారం రైతు నేస్తం కార్యక్రమంలో కూరగాయల సాగుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తులు, మిరప పంటపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జానయ్య మాట్లాడుతూ వానాకాలం సాగుపై ముందస్తు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. అనంతరం సీఎం రేవంతరెడ్డి భూ భారతి పోర్టల్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వీసీ ద్వారా రైతులు వీక్షించారు. కార్యక్రమంలో ఏవో పి.జ్యోతి, పూడూర్ మాజీ సర్పంచ్ రాంరెడ్డి, ఏఈవోలు శ్రీలత, గ్రీష్మ పాల్గొన్నారు.

పైసలివ్వందే పని జరగదు..



- మారని లంచగొండి అధికారుల తీరు
- ఏసీబీకి వరుసగా చిక్కుతున్న అవినీతి చేపలు
- నాలుగు నెలల్లో ఐదుగురు ఉద్యోగులు కటకటాల్లోకి



ధర్మపురిలో ఏసీబీకి చిక్కిన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ (ఫైల్)

మెట్‌పల్లి ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్ అసిఫొద్దీన్(ఫైల్)

కోరుట్లలో ఏసీబీకి పట్టుబడిన ఎస్ఐ శంకరయ్య(ఫైల్)

జగిత్యాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): చేయి తడపందే కొంతమంది ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు కార్యాలయాల్లో పనిచేయడం లేదు. పని జరగాలంటే అంతో ఇంతో ముట్టజెబితే కానీ ఫైలు ముందుకు కదలడం లేదు. అత్యాశకు పోతున్న కొంతమంది అధికారులు లంచాలు తీసుకుంటూ కటకటాల పాలవుతున్నారు. వివిధ పనుల నిమిత్తం, బిల్లుల మంజూరు కోసం లంచాలు డిమాండ్ చేసే అధికారులు, సిబ్బందిపై ఇటీవల జిల్లాలో ఏసీబీ వరుస దాడులు కలకలం రేపుతున్నాయి. అవినీతి అధికారుల విషయంలో మీనమేషాలు లెక్కించకుండా ఏసీబీ దూకుడు పెంచడంతో యంత్రాంగంలో గుబులు మొదలైంది. గడిచిన నాలుగు నెలల్లో ఐదుగురు అధికారులు ఏసీబీకి చిక్కడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

● మధ్యవర్తులనూ వదలని వైనం

లంచం తీసుకుంటే రెడ్ హ్యాండెడ్‌గా దొరికితే సదరు అధికారులు, సిబ్బందిపై ఏసీబీ అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో పాటు మధ్యవర్తుల ద్వారా లంచం తీసుకున్న అధికారులనూ వదిలిపెట్టడం లేదు. ఏసీబీ కేసులను తప్పించుకోవడానికి పలువురు అధికారులు మధ్యవర్తుల ద్వారా లంచం తీసుకుంటున్నారు. దీంతో మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న వారిపై కూడా ఏసీబీ అధికారులు కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది జనవరిలో మెట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు నిర్వహించిన సమయంలో డాక్యుమెంట్ రైటర్‌ను సైతం అదుపులోకి తీసుకున్నారు. గతంలో మధ్యవర్తులు డబ్బులు తీసుకున్నట్లయితే వారిని అరెస్టు చేసే విధానాన్ని అవలంబించక పోయేవారు. కొంతకాలంగా వీరిపై ఏసీబీ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు.

ఇటీవల పట్టుబడిన అధికారులు...

● ఈనెల 11న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గల ట్రెజరీ జిల్లాశాఖ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న అరిగె రమకుమార్ ఏసీబీకి చిక్కాడు. కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ వద్ద నుంచి రూ.7 వేల లంచం డబ్బులను తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.

● మార్చి 6న ధర్మపురి మున్సిపల్ కమిషనర్ కందుకూరి శ్రీనివాస్ కార్యాలయంలో పనిచేసే కాంట్రాక్టు ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ మహేశ్ వద్ద వేతనం చెల్లింపుకోసం రూ.20వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

●మార్చి 5న కోరుట్ల ఎస్ఐ శంకరయ్య రూ.5 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. కోరుట్ల మండలం జోగినిపల్లి శివారులో పేకాట ఆడుతూ 8మంది పట్టుబడ్డారు. వారిలో శ్రీనివాస్ అనే వ్యక్తి సెల్ ఫోన్ రిలీజ్ చేయడానికి ఎస్ఐ రూ.5వేలు లంచం తీసుకుటుండగా ఏబీసీ అధికారులు పట్టుకున్నారు.

● జనవరి 15న మెట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు జరిపారు. ల్యాండ్ మార్ట్‌గేజ్ చేసేందుకు మెట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ అసిఫొద్దిన్, డాక్యుమెంట్ రైటర్ రవి, ఆఫీస్ సబార్డినేట్ రవిలు కలిసి...

మిగతా 8లో..

● జిల్లాలో మరికొందరిపై నిఘా

జిల్లాలో మరికొందరు అవినీతి అధికారులపై ఏసీబీ నిఘా పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. పలు ప్రభుత్వశాఖల్లో నెలవారీగా మామూళ్లు తీసుకుంటున్నట్లు ఏసీబీ అనుమానిస్తోంది. రేషన్ బియ్యం, ఇసుక అక్రమ రవాణా, మొరం, కలప రవాణా, పేకాట, బెల్టు షాపులు, దాబా హోటళ్లు తదితర వ్యాపారులతో మద్యం, బార్ అండ్ రెస్టారెంట్ల నుంచి కొంతమంది అధికారులు నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి. వీటిపై సైతం ఏబీసీ దృష్టి సారించినట్లుగా ప్రచారం జరుగుతోంది. దీంతో అవినీతి అధికారులు ఎప్పుడు ఏమి జరుగుతుందోనని జంకుతున్నారు.

● ఏసీబీ వలలో జిల్లా యంత్రాంగం

జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అవినీతి అధికారులను టార్గెట్ చేస్తూ ఏసీబీ నిఘా పెంచడంతో అధికారుల్లో ఆందోళన మొదలైంది. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ చాంబర్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఓ ట్రెజరీ ఉద్యోగి ఇటీవల అవినీతికి పాల్పడడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నిత్య ఉన్నతాధికారుల రాకపోకలు, నిఘాఉండే కలెక్టరేట్‌లో సిబ్బంది లంచం డిమాండ్ చేయడం, ఏసీబీ అధికారులకు పట్టుపడడం కలవరం సృష్టించింది. గత నాలుగు నెలల్లో జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖ, ట్రెజరీశాఖ, మున్సిపల్, శాఖ, పోలీసుశాఖ, రవాణాశాఖ, అటవీ శాఖల్లో ఏసీబీ అధికారులు సోదాలుచేసి ఐదుగురు అధికారులను వల వేసి పట్టుకున్నారు.



జగిత్యాల ట్రెజరీ కార్యాలయంలో పరిశీలన జరుపుతున్న ఏసీబీ అధికారులు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మేడిపల్లి, ఏప్రిల్ 14 : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొండాపూర్ గ్రామంలోని పద్మశాలి కల్యాణ మండపంలో సోమవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన 132మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 46 మందికి కంటి శస్త్ర చికిత్స అవసరం కాగా వారిని రేకుర్తిలోని కంటి ఆసుపత్రికి రెఫర్ చేశారు. వారందరికీ మంగళవారం చికిత్స చేయించనున్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు మేన్నేని కిరణ్ రావు, అభిలాష్, అధ్యక్షుడు వినోద్‌కుమార్, గంగధర్, కార్యదర్శి ఇషాక్, ప్రభాకర్‌రావు, రత్నకర్, రవి, రాము, గణేష్, సతీష్ పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు ఆరాధ్యుడు అంబేద్కర్

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- ఘనంగా అంబేద్కర్ జయంతి



కేక్ కట్ చేస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాలకు ఆరాధ్యుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహసీల్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి, కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్ బీఎస్ లత, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, టీపీసీసీ సెక్రెటరీ బండ శంకర్ తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడారు. జగిత్యాలలో స్టడీ సర్కిల్ నిర్మాణానికి నిధులు మంజూరుకు, తహసీల్ చౌరస్తా ఆధునీకరణ కోసం కృషి చేస్తానన్నారు.

అంబేద్కర్ అందరి వాడు
-జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

అంబేద్కర్ అందరి వాడని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ అన్నారు. అంబ్కేదర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకవెళ్లి యావర్ రోడ్డు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తహసీల్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహ సుందరీకరణకు, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ఏర్పాటుకు కృషి జరుగుతుందన్నారు.

దేశ పటిష్టతకు రాజ్యాంగమే కారణం..
-మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

దేశం పటిష్టంగా ఉండడానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే కారణమని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. వీస్సీ, ఎస్టీ నిరుపేద విద్యార్థులకు స్థానికంగా ఉన్న బెస్ట్ అవలెబుల్ స్కూల్‌లో ఉచిత విద్యా సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్‌కు మాజీ మంత్రి జీవన్ రెడ్డి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్

కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

● కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక వసతులు కల్పించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. సోమవారం కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామంలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాట చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ నర్సరెడ్డితో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాల న్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, రైతు సమన్వయ కమిటీ జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకటరావు, వైస్ చైర్మన్ జీవన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మోహన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ పేర్ల సత్యంలు పాల్గొన్నారు.

● మల్లాపూర్, ఏప్రిల్14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. సోమవారం మల్లాపూర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ యార్డు కమిటీ పాలక వర్గంతో కలిసి ప్రారంభించారు. అనంతరం ధాన్యం తేమ శాతంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వహకులు రైతులుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని తొందరగా తూకం వేసి డబ్బులు రైతుల ఖాతాలో జమ చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ నర్సారెడ్డి, సీఈవో భూమేష్, సిబ్బంది, పాలక వర్గం, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

హామీల అమలుకు ప్రభుత్వం కృషి

● కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు



లబ్ధిదారు ఇంట్లో సహపంక్తి భోజనం చేస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీల అమలుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. సోమవారం కోరుట్ల పట్టణంలోని సన్న బియ్యం లబ్ధిదారు ఇంట్లో ఏర్పాటు చేసిన సహపక్తి భోజనంలో పాల్గొ న్నారు. ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడారు. ప్రభుత్వం పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరుమల గంగాధర్, తిరుమల గంగాధర్, మహిపాల్ రెడ్డి, మచ్చ కవిత, ఎండేరి నాగభూషణం, ఏం బేరి సత్యనారాయణ, నేమూరి భూమయ్య, చటిమెల్లి రంజిత్ గుప్తా, బోల్లే నర్సయ్య, చిలు వేరి విజయ్, అయిండ్ల గణేష్, తెడ్డు విజయ్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా కేంద్రంలోని గుట్ట రాజేశ్వర స్వామి ఆలయ సమీపంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో ప్రత్యేకపూజ కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు బోగ శ్రావణి తదితరులు వేడుకల్లో పాలు పంచుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే మడేలేశ్వరస్వామి ఆల య సమీపంలో ఉన్న గుండు హనుమాన్ని విగ్రహాన్ని మంత్రి జీవన్‌రెడ్డి దర్శించుకుని పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం

రాయికల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని చింతలూరు, బషీర్‌పల్లె గ్రామాల్లో సోమవారం బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న పార్టీ మండల అధ్యక్షుడు బర్కం మల్లేష్, మండల, పట్టణ కో ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డిలు పాల్గొని ఈ నెల 27న వరంగల్‌లో కేసీఆర్ తలపెట్టిన రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు ముద్దం నారాయణ, నాయకులు దారవత్ శ్రీను, అనుపురం రవి గౌడ్, అల్లెపు నర్సయ్య, రాజు, వెంకటేష్, రాజేందర్, సాయి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ కిసాన్ సంఘ్ కార్యవర్గం ఎన్నిక

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): భారతీయ కిసాన్ సంఘ్ జగిత్యాల కార్యవర్గాన్ని సోమవారం జిల్లా కేంద్రంలోని స్థానిక గీతా గ్రంథాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాసారం భూమరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఇప్ప రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా నోముల నర్సింహారెడ్డి, ముద్దం గంగారెడ్డి, భూస మల్లేష్, ఏలేటి రాజేశ్వర్, సహాయ కార్యదర్శులుగా చల్ల సురేందర్, గుర్రాల జలంధర్, మ్యాకల మహేష్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన కమిటీ మూడేళ్లవరకు పనిచేస్తుందని ఎన్నికల పరిశీలకులు తెలిపారు. జాతీయ కార్యవర్గ సభ్యులు ముదిగంటి శ్రీధర్‌రెడ్డి, విజయ్ భాస్కర్‌రెడ్డిలు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ జోనల్‌అధ్యక్షుడు రాగుల లింగారెడ్డి, లక్ష్మారెడ్డి, తిరుపతిరెడ్డి, అశోక్‌రావు, సత్యనారాయణ తదితరులున్నారు.

ఫేస్‌బుక్ పోస్టులు.. పేదల జీవితాల్లో వెలుగులు

- పదేళ్లలో రూ.1.75 కోట్ల విరాళాల సేకరణ
- 26 మంది నిరు పేదలకు ఇళ్ల నిర్మాణం
- ఆదర్శంగా నిలుస్తున్న సామాజిక సేవకుడు రమేష్

7



బీర్‌పూర్‌కు చెందిన పేద కుటుంబానికి ఇంటి నిర్మాణం చేసి ఇచ్చిన సామాజిక సేవకుడు రమేష్(ఫైల్)

వెళ్లొస్తాం.. అంజన్నా

- జయంతి ఉత్సవాలు ముగియడంతో తిరిగి వెళ్తున్న భక్తులు
- హనుమాన్ చిన్న జయంతి ఆదాయం రూ.1.67 కోట్లు

7



బైక్‌ను ఢీకొట్టిన కారు

● ముగ్గురికి తీవ్రగాయాలు



గాయాలపాలైన క్షతగాత్రులు

వేములవాడ టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ దైవదర్శనానికి వచ్చి తిరిగి ఇంటికి వెళుతున్న క్రమంలో రోడ్డు పక్కన బైక్‌పై ఆగివున్న వ్యక్తులను మద్యం మత్తులో ఉన్న కారు డ్రైవర్ స్పీడ్‌గా వచ్చి ఢీకొట్టాడు. వేములవాడ మండలం అనుపురం గ్రామశివారులో ఆదివారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖాజీపూర్ గ్రామానికి చెందిన వెంకటేశ్ తన భార్య రజిత, కొడుకు అభిరామ్‌తో కలిసి వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. తిరిగి తమ ద్విచక్రవాహనంపై అర్ధరాత్రి ఖాజీపూర్ వెళుతున్న క్రమంలో అనుపురం గ్రామం వద్ద ఆగారు. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి వేములవాడకు వస్తున్న ఓ కారు రోడ్డుపక్కన ద్విచక్రవాహనం పక్కన నిల్చుని ఉన్న వెంకటేశ్, రజిత, కొడుకు అభిరామ్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో వెంకటేశ్, అభిరామ్ కాళ్లకు తీవ్రగాయాలు కాగా, రజిత తలకు గాయాల య్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కారులో ఉన్న ముగ్గురిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కూలీలతో వెళుతున్న ఆటో బోల్తా

● ముగ్గురికి తీవ్రగాయాలు



బోల్తా పడిన ఆటో

శంకరపట్నం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన కూలీలు సోమవారం ఆటోలో కూలీపనికి వెళ్లివస్తుండగా ఆముదాలపల్లి శివారులోని బ్రిడ్జి వద్ద ఆటో అదుపుతప్పి బ్రిడ్జి కింద పడిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపూర్‌కు చెందిన కనకం అంజయ్య ఆటోలో అతని భార్య సారమ్మ, కోడళ్లు నందిని, సంగీతతోపాటు కుక్కముడి వీరయ్య, అతని భార్య ఎల్లమ్మ, మాతంగి మధురమ్మ, మాతంగి శంకరమ్మ తీసుకొని ఉదయాన్నే వీణవంక మండలం కాపులపల్లెకు మొక్కజొన్న కంకి పొత్తు తీయడానికి వెళ్లారు. పనిముగించుకొని తిరిగి వస్తుండగా, ఆముదాల పల్లి శివారులో బ్రిడ్జి వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న 8మందిలో ఐదుగురికి గాయాలు కాగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ ఆటోడ్రైవర్ అంజయ్య, మధురమ్మ, శంకరమ్మను 108లో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైనవైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించి నట్లుసమాచారం.మిగిలినవారుసమీపఆస్పత్రిలోచికిత్స పొందుతున్నారు.

పిచ్చికుక్కల దాడిలో 14మందికి గాయాలు

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామంలో సోమవారం పిచ్చికుక్కలు దాడిచేసి 14 మందిని గాయపర్చినట్లు మోరపల్లి గ్రామస్థులు తెలిపారు. గాయపడ్డ వారిని జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అధికారులు స్పందించి వెంటనే పిచ్చికుక్కల బారి నుంచి కాపాడాలని మోరపల్లి గ్రామస్థులు కోరుతున్నారు.





తరలుతున్న టేకు కలప

ఎస్సారెస్పీ స్థలంలో టేకు వనం

పట్టించుకోని అధికారులు

ఓదెల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోని ఎస్సారెస్పీ టేకువనం దొంగల పాలవుతుంది. 15 యేళ్ల క్రితం నాలుగు గుంటల భూమిలో దాదాపు 150 టేకు మొక్కలు నాటారు. వీటికి సరైన రక్షణ చర్యలు చేపట్టలేదు. దీంతో 50 చెట్ల వరకు ఎండిపోగా, మిగిలిన 100 చెట్లు వృక్షాలుగా మారుతుండగా ఒక్కొక్క చెట్టు దొంగల పాలవుతున్నాయి. మూడేళ్ల క్రితం ఎస్సారెస్పీ క్యాంపులో కొందరు గ్రామస్థులు నివాసం ఉండడంతో టేకు వనానికి రక్షణగా ఉండేది. వారు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలోకి మారడంతో విలువైన టేకు కలప మాయమైపోతుంది.

రెండేళ్ల క్రితం గాలి దుమారానికి రెండు పెద్ద చెట్లు నేల కూలి పోగా అవి దొంగల పాలయ్యాయి. మిగిలిన వాటిని రక్షణ లేకపోవడంతో రాత్రి వేళలో మిషన్‌లతో చెట్లను కోసి తీసుకెళ్తున్నారు. దీంతో వనంలో చెట్ల మోడులు దర్శనమిస్తున్నాయి. మిగిలిన వృక్షాలను వేలం వేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో నెలకొక్క టేకు చెట్టును కట్టర్లతో కోసుకెళుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో భవనాల నిర్మాణం అధికమవడంతో టేకు కలపకు డిమాండ్ పెరిగింది. దీంతో ఒక్కొక్క చెట్టు చోరీకి గురవుతోంది. టేకు కలప చోరీ ఇంటి దొంగలా లేక బయటి దొంగల పనా అనే అనుమానాలను గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారు. ఎదిగిన చెట్లను వేలం వేసి దొంగల పాలవకుండా అధికారులు చర్యలు చేపట్టాలని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రహరీ నిర్మిస్తాం : ఏఈఈ రాజు



ఎస్సారెస్పీ భూమిలో సర్వేయర్‌తో కొలతలు వేయించి, లేఅవుట్ ఏర్పాటు చేస్తాం. ఎస్సారెస్పీ భూమి చుట్టూ ప్రహరీ నిర్మించి చెట్లు చోరీకి గురికాకుండా చూస్తాం. నిధుల కోసం ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వానికి నివేదికను పంపిస్తాం.

టేకు కర్రను విక్రయించాలి

వేయి గండ్ల తిరుపతి, గ్రామస్థుడు, పొత్కపల్లి



టేకు కర్ర దొంగల పాలవక ముందే విక్రయించి ఎస్సారెస్పీ మండల కార్యాలయంలో తగిన సౌకర్యాలను ఏర్పాటు చేయాలి. లేకుంటే టేకు వనాన్ని కాపాడేందుకు క్యాంపులో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలి.

హార్వెస్టర్ ఢీకొని మహిళ మృతి

● మొట్లపల్లిలో విషాదం



కనకమ్మ(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మొట్లపల్లి గ్రామానికి చెందిన దాసరి కనకమ్మ(50), రాగుల వసంత (45) సోమవారం భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెంకట్రావుపల్లెలో కూలీకి వెళ్లారు. తిరిగి గ్రామానికి వస్తున్న సమయంలో వెంకట్రావుపల్లి శివారులో హార్వెస్టర్ ఢీకొనగా దాసరి కనకమ్మ అక్కడి క్కడే మృతిచెందింది. రాగుల వసంతకు తీవ్రగాయాలు కాగా 108ద్వారా చిట్యాలకు తరలించినట్లు బాధితుల కుటుంబ సభ్యులు తెలిపారు. పనికి వెళ్లి కనకమ్మ మృతి చెంది వసంతకు తీవ్రగాయాలు కావడంతో వారితో పనికి వచ్చిన తోటి కూలీల రోదనలు మిన్నంటాయి.

కోడెలను తరలిస్తున్న వాహనం పట్టివేత

సుల్తానాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని గడ్చిరోలి నుంచి ఎడ్లను తరలిస్తున్న వాహనాన్ని సుల్తానాబాద్‌లో పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గడ్చిరోలి నుంచి నాలుగు ఎడ్లను ఒకట్రాలీలో తరలిస్తుండగా సుల్తానాబాద్‌కు చెందిన భూసారపు సంపత్, పృథ్వీ బండారు సూర్య పట్టుకుని పోలీసులకు అప్పగించారు.



పట్టుబడిన వాహనం



రథోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్థులు

ఘనంగా రథోత్సవం

గంగాధర, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలం కోట్లనర్సింహులపల్లిలో సోమవారం లక్ష్మీ నర్సింహస్వామి, సీతారామ చంద్రస్వామి, వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తుల రథోత్సవం ఘనంగా సాగింది. అనంతరం ఉత్సవమూర్తులను గరుడ, ఆంజనేయ, అశ్వవాహనములపై ఆలయ పునఃప్రవేశం చేశారు. పండితులు శేషహోమం, మహపూర్ణాహుతి, చక్రతీర్థం, ఏకాంతసేవ తదితరాలు నిర్వహించారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

వేములవాడ రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):గంజాయి తరలిస్తున్న ముగ్గురిని అరెస్టుచేసినట్లు రూరల్‌ఎస్సై మారుతి తెలిపారు. జగిత్యాల జిల్లాకు చెందిన రాకేష్, సాయి కిరణ్, బీహార్‌కు చెందిన సనీల్ దాదాపు 100 గ్రాముల గంజాయిని తరలి స్తుండగా ఫాజుల్‌నగర్ గ్రామంలో వారిని పట్టుకుని అరెస్టుచేసినట్లు తెలిపారు. రూరల్‌సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మారుతి తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడి మృతి

మల్యాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): దిగువ కొండగట్టు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని దివ్యాంగ యాచకుడు(45) దుర్మరణం చెందాడు. మృతుడికి కుడి కాలు మోకాలు వరకే ఉండగా కొండగట్టులో యాచిస్తూ జీవిస్తున్నాడు. నిత్యం రహదారి పక్కనే పడుకునే యాచకున్ని సోమవారం వేకువజామున గుర్తు తెలియని వాహనం తలపై నుంచి వెళ్లడంతో తీవ్రగాయాలు అయి అక్కడిక్కడే మృతిచెందాడు. స్థానికులు డయల్ 100కు సమాచారం అందించడంతో పోలీసులు మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచి కేసు నమోదు చేశారు.

శివరాంపల్లి దర్గాలో గుప్తనిధుల కోసం తవ్వకాలు

● పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

● కేసు నమోదు



దర్గాలో తవ్విన గుంత

సైదాపూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివరాంపల్లి దర్గాలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరపడం కలకలం రేపుతోంది. వివరాలలోకి వెళ్తే.. సైదాపూర్ మండలంలోని శివరాంపల్లి దర్గాలో గుప్తనిధుల కోసం కొందరు వ్యక్తులు తవ్వకాలు చేపట్టారు. ఫ్లోరింగ్ పగుల గొట్టి గుంతలు తవ్వారు. గ్రామంలో కొందరు మస్లింలు దర్గాకు దర్శనం కోసం వెళ్లగా దర్గాలో లోతైన గుంతలు ఏర్పడి ఉన్నాయి. దీంతో వారు అనుమానం ఉన్న వారిని పిలిపించి అడుగగా పొంతనలేని సమాధానం చెప్పడంతో ఆదివారం అదే గ్రామానికి చెందిన సయ్యద్‌సర్దార్ అనేవ్యక్తి సైదాపూర్ పోలీస్ స్టేషను ఆశ్రయించాడు. మా గ్రామంలోని దర్గాలో గుప్తనిధుల తవ్వకాలు జరిగాయన్నారు. దీనికి కారణం కరీంనగర్‌కు చెందిన గౌసియా బేగం, ఆమె కుమారుడు యాకుబ్ పాషా, ఆమె కోడలు నేహాలే కారణమన్నారు. వారు కొన్ని రోజులుగా దర్గాపరిసరాలలో కనిపిస్తున్నారని, దర్గాకమిటీ అనుమతి లేకుండా వారు అక్రమంగా దర్గాలోకి ప్రవేశించి దర్గా లోపల గుప్త నిధుల కోసం తవ్వకాలు చెపట్టారన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. సయ్యద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు.

రేషన్ బియ్యంపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం

● గోదావరిఖని వన్‌టౌన్‌లో కేసు నమోదు

కోల్‌సిటీ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రేషన్ షాపుల్లో సన్నబియ్యం పేర ప్లాస్టిక్‌బియ్యాన్ని పంపిణీ చేస్తుందంటూ గోదావరిఖనికి చెందిన ఒక వ్యక్తి సోషల్ మీడియాలో ఒక వీడియో పోస్టు చేయడం కలకలం రేపింది. గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన ఒక డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకుడు తిలక్‌నగర్‌లోని ఒక రేషన్ షాపులో మేము తీసుకున్న బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం వచ్చిందంటూ నాలుగు రోజుల క్రితం సోషల్ మీడియాలో వీడియో పెట్టాడు. ప్రజలారా ఆరోగ్యం జాగ్రత్త అంటూ హెచ్చరించాడు. కిలో బియ్యంలో 100గ్రాముల ప్లాస్టిక్ బియ్యం అంటూ ఆ వీడియోలో పేర్కొన్నాడు. విజయ్ ఎంజే కొరియో గ్రాఫర్ అకౌంట్‌పై ఈ పోస్టు పెట్టడంతో వైరల్‌గా మారింది. దీనిపై సివిల్ సప్లయి అధికారులు విచారణ జరిపారు. గోదావరిఖని పట్టణంలోని పలు రేషన్ షాపుల్లో సోమవారం ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సివిల్‌సప్లయి డిప్యూటీ తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తనిఖీలు నిర్వహించారు. ఎక్కడా కూడా ఎలాంటి కల్తీ ఆనవాళ్లు లేవని డీఎస్‌ఓ పేర్కొన్నారు. ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించడం ద్వారా ప్రభుత్వాన్ని, పౌరసరఫరాలశాఖను బదనాం చేసేందుకు ఈపోస్టు పెట్టినట్టు భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. దీనిపై పౌరసరఫరాల శాఖ డీటీ రవీందర్‌రెడ్డి సోమవారం సాయంత్రం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. పోలీసులు విచారణ ప్రారంభించడంతో పోస్టుపెట్టిన వ్యక్తి సోషల్ మీడియాలో వెంటనే ఆ పోస్టును డిలీట్ చేశాడు.

అర్చకుల మధ్య వివాదంతో ఆలయానికి తాళం

● పోలీసుల జోక్యంతో తెరుచుకున్న ఆలయం

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలో ఇద్దరు అర్చకసోదరుల మధ్య నెలకొన్న వివాదంతో సోమవారం ఆలయానికి తాళం పడింది. జగిత్యాలలోని నిజామాబాద్ రోడ్డులో గుట్ట రాజేశ్వరస్వామి ఆలయానికి దేవాదాయ శాఖ గుర్తింపుఉంది. ఈఆలయానికి వంశ పారంపర్య ధర్మకర్తగా, అర్చకులుగా ఇద్దరు సోదరులు వ్యవహరిస్తున్నారు. దేవా దాయ కమిషనర్ ఉత్తర్వులమేరకు ఓ సోదరుడితో పాటు అతడి ఇద్దరు కుమారులు ప్రస్తుతం అర్చకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో మరో సోదరుడు సోమవారం ఆలయానికి తానే అర్చకుడినని తన వద్ద జీవో ఉందంటూ గుడిమెట్ల మార్గంలో ఉన్న గేటుకు తాళం వేశాడు. దీంతో మరో సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తాళం తీయించారు. దీంతో సమస్య తాత్కాలికంగా సర్దుమణిగింది. అయితే ఇద్దరి అర్చకులమధ్య వివాదంతో భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. ఈవిషయంపై దేవాదాయశాఖ ప్రత్యేక దృష్టిసారించాలని పలువురు భక్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పేకాట స్థావరంపై దాడి: ఎనిమిది మందిపై కేసు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్‌లో ఓ పేకాట స్థావరంపై సోమవారం రాత్రి టౌన్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. ఈదాడుల్లో ఎనిమిదిమంది ప్రముఖులను పట్టుకొని వారివద్ద రూ.30,930 నగదు, 8మొబైల్‌ఫోన్‌లు,52కార్డ్స్ స్వాధీనం చేసుకున్నారు. సీఐ కృష్ణ వివరాల ప్రకారం.. విద్యానగర్‌లోని ప్రముఖ నాయకుడి ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు పక్కాసమాచారం మేరకు తనిఖీ చేశామన్నారు. ఈతనిఖీల్లో 8మంది పేకాట ఆడుతుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేశామని సీఐ తెలిపారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కుటుంబానికి పీఆర్టీయూ ఆర్థికసాయం

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఔట్ సోర్సింగ్‌లో ఒకేషనల్ టీచర్‌గా పనిచేస్తున్న బంధారపు నవీన్ కుమార్ ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మరణించడంతో ఆ కుటుంబానికి పీఆర్‌టీయూ నాయకులు సోమవారం ఆర్థిక సహాయాన్ని అందించారు. పీఆర్‌టీయూలో క్రియాశీలక సభ్యత్వం కలిగిన నవీన్‌కుమార్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని పీఆర్‌టీయూ టీఎస్ మాజీ అసోసియేట్ అధ్యక్షుడు వంగ మహేందర్ రెడ్డి నవీన్‌కుమార్ సతీమణి కిరణ్మయికి చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గన్నమనేని శ్రీనివాసరావు, ఎడ్ల కిషన్, ట్రైబల్ టీచర్ ఫెడ రేషన్ నాయకులు భూక్య అజ్జునాయక్, మండల ప్రధాన కార్యదర్శి బూర్ల సత్యనారాయణ, ఒకేషనల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్, కోశాధికారి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సప్తగిరి కాలనీలో దొంగతనం

● 17.5 తులాల బంగారు ఆభరణాలు, రూ.35 వేల నగదు చోరీ



విచారణ చేస్తున్న సీఐ సృజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సప్తగిరికాలనీలో ఆదివారం అర్ధరాత్రి భారీ దొంగతనం జరిగింది. 17.5 తులాల బంగారు ఆభరణాలు, రూ.35వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుల వివరాల ప్రకారం.. సప్తగిరి కాలనీకి చెందిన నేరెల్ల రమేష్‌గౌడ్ ఆదిలాబాద్ భుక్తాపూర్‌లో మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం కరీంనగర్‌లో బంధువుల ఇంటిలో శుభకార్యానికి హాజరైన రమేష్‌గౌడ్ దంపతులు రాత్రి సప్తగిరి కాలనీలోని తమ ఇంటికి చేరుకున్నారు. వేసవికావడంతో ఇంటికి రెండు వైపుల తలుపులు తెరిచి నిద్రించారు. అర్ధరాత్రి వేళ దొంగలు ఇంట్లోకి చొరబడి హ్యాండ్‌బ్యాగ్, బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం బ్యాగ్ చూసుకోగా అందులో బంగారు ఆభరణాలు, నగదు కనిపించలేదు. బీరువా తెరిచి ఉంది. దుస్తులు, ఇతర వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దొంగతనం జరిగినట్లు గ్రహించిన బాధితులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, టూటౌన్ సీఐ సృజన్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించినట్లు, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

సుల్తానాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన వంగ మల్లయ్య అనే గీత కార్మికుడు సోమవారం తాటి చెట్టు పై నుంచి కిందపడగా తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే సుల్తానాబాద్‌ఆస్పత్రిలో చేర్పించగా మెరుగైన చికిత్సకోసం కరీంనగర్ తరలించారు. గాయపడిన కార్మికుడిని జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ పరామర్శించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు

● తప్పిన పెనుప్రమాదం

మల్యాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని దిగువ కొండగట్టు బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సును వెనుకాల నుంచి వచ్చిన కారు ఢీకొంది. ప్రయాణికులతో ముందుకు కదులుతున్న బస్సును కారు ఢీకొనడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాలు బారులు తీరగా పోలీసులు ట్రాఫిక్ తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. కాగా ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని స్థానికులు తెలిపారు.

పేదలకు అండగా.. ఆలయ ఫౌండేషన్

● పుట్టిన ప్రాంతంపై మమకారంతో ఐఏఎస్ సేవలు

వీణవంక, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పుట్టిన ప్రాంతంపై ప్రేమతో ఇక్కడి పేదలను ఆదుకునేందుకు ఐఏఎస్ అధికారి పి నరహరి 2015లో ఆలయ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం ఆయన మధ్యప్రదేశ్ ప్రభుత్వంలో ప్రిన్సిపల్ సెక్రెటరీగా పనిచేస్తున్నారు. పలువురు స్థానికులను కో ఆర్డినేటర్లుగా నియమించి వారి ద్వారా ఆపదలో ఉన్నవారికి తమకు తోచిన విధంగా సహాయం అందిస్తున్నారు.

● పలు సేవా కార్యక్రమాలు

ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీణవంక మండలంలోని ఘన్ముక్ల గ్రామంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 400 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి మందులు అందజేశారు. కనపర్తి గ్రామానికి చెందిన కోల రాజయ్యకు జైపూర్ ఫుట్‌ను అందించారు. వల్భాపూర్ గ్రామానికి చెందిన నామని రాజయ్యకు ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందించారు. విద్యార్థులకు కోర్సులపై అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి స్టడీ మెటీరియల్ అందజేస్తున్నారు. పేదంటి ఆడపిల్లల పెళ్లిలకు ఆర్థికసాయం అందిస్తున్నారు. ప్రస్తుతం ఆలయ ఫౌండేషన్‌కు 600మంది వలంటీర్లు ఉన్నారు.

● సేవలు విస్తరిస్తాం..

- గాదె గుణసాగర్,

ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్

నిరుపేదలకు ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలురకాల సేవలు అందిస్తున్నాం. రాబోయే రోజుల్లో యువతకు ఉపాధి, విద్యలో ఎక్కువగా సాయం అందిస్తాం. మమ్మల్ని సంప్రదించిన వారికి తప్పకుండా సాయం అందిస్తున్నాం. సేవలు విస్తరించేందుకు ప్రణాళి కలు రూపొందిస్తున్నాం.



ఘన్ముక్లలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న ఆలయ ఫౌండేషన్ సభ్యులు(ఫైల్)

ఆచూకీ తెలపరూ..!

మావోయిస్టు నేత బెజ్జారపు కిషన్ భార్య పుష్ప విన్నపం



భార్య పుష్పతో కిషన్(ఫైల్)

కోరుట్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : తన భర్త ఎక్కడ ఉన్నడో ఆచూకీ తెలపాలని మావోయిస్టు నేత బెజ్జారపు కిషన్ భార్య పుష్ప వేడుకుంటోంది. కోరుట్ల పట్టణంలోని నారాయణ-నర్సమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు కాగా పెద్ద కుమారుడు కిషన్. కోరుట్ల మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన పుష్పతో ఆయనకు 1976లో వివాహం జరిగింది. 1978లో జరిగిన జగిత్యాల జైత్రయాత్రలో పాల్గొని సాయుధ పోరాటం వైపు ఆకర్శితుడైన కిషన్ జగిత్యాల కేంద్రంలో బుల్లెట్ వాహన మెకానిక్‌గా పని చేసేవాడు. 1980లో సాయిని ప్రభాకర్ నేతృత్వంలో ఉద్యమం వైపు ఆకర్షితుడైన బెజ్జారపు కిషన్ పీపుల్స్‌వార్ పార్టీలో చేరి అజ్ఞాతంలోకి వెళ్లాడని భార్య పుష్ప తెలిపింది. అజ్ఞాతంలోకి వెళ్లిన తన భర్త కిషన్ సమాచారం ఇప్పటికీ తెలియ లేదని వాపోయింది. 2012లో నూతన సంవత్సరం శుభాకాంక్షలు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో కిషన్ ఫొటోతో రివార్డును ప్రకటించారు. అదే సమయంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కూడా కిషన్‌పై రివార్డును ప్రకటించారు. కిషన్ తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతిచెందగా వారి అంత్యక్రియలకైనా వస్తాడని కుటుంబ సభ్యులు ఆశించినా అతను మాత్రం రాలేదు. కిషన్ జాడ కోసం భార్య పుష్ప పలు మార్లు పౌర హక్కుల నాయకులను కలిసినా ఫలితం లేకుండా పోయింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఏ ఎన్‌కౌంటర్ జరిగినా ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని కిషన్ భార్య ఆందోళన చెందుతోంది. ఆమె ప్రస్తుతం బీడీలు చుడుతూ కాలం వెల్లదీస్తోంది.



బీడీలు చుడుతున్న పుష్ప

పేదల జీవితాల్లో ఫేస్‌బుక్ పోస్టులు వెలుగులు

- పదేళ్లలో రూ.1.75 కోట్ల విరాళాల సేకరణ
- 26 మంది నిరు పేదలకు ఇళ్ల నిర్మాణం
- ఆదర్శంగా నిలుస్తున్న సామాజిక సేవకుడు రమేష్



విరాళాలతో అప్పటి కలెక్టర్ రవి చేతుల మీదుగా సైకిళ్లు పంపిణీ చేయిస్తున్న సామాజిక సేవకుడు రమేష్ (ఫైల్)

విద్య, వైద్యానికి సహాయం

పదేళ్లలో రమేష్ 141 మంది నిరుపేదలకు రూ.1.75 కోట్ల విరాళాలను పంపిణీ చేయించారు. వాటిలో 26 మంది పేదలకు ఇళ్ల నిర్మాణం చేయించగా, మిగిలిన పేదలకు విద్య, వైద్యం కోసం సాయం అందించారు. 200 మంది నిరుపేద విద్యార్థుల కోసం సైకిళ్లు పంపిణీ చేయించారు. కేవలం ఒక ప్రాంతానికో, ఒక జిల్లాకో పరిమితం గాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రలోని నిరుపేద ప్రజల కోసం రమేష్ ఫేస్‌బుక్‌ను వినియోగిస్తున్నాడు. దాతల ద్వారా సాయం అందిస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నాడు రమేష్.

ధర్మపురి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో కొందరు సోషల్ మీడియాను కాలక్షేపానికి, మరికొందరు వినోదం కోసం వినియోగిస్తున్నారు. అందుకు భిన్నంగా జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేష్ ఫేస్‌బుక్‌ను పేద ప్రజలకు సాయం చేయడానికి వినియోగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. 2015 సంవత్సరంలో సేవా కార్య క్రమాలు ప్రారంభించిన రేణికుంట రమేష్ ఇప్పటి వరకు 141 మంది నిరుపేద కుటుంబాలకు రూ.1.75 కోట్ల విరాళాలను దాతల ద్వారా పంపిణీ చేయించారు.

దశాబ్ద కాలంగా సమాజ సేవ

ధర్మపురి మండలం బురుదేశిపల్లె గ్రామానికి చెందిన రాగుల వైష్ణవి అనే విద్యార్థిని పదేళ్ల క్రితం అనారోగ్యానికి గురై మంచానికే పరిమితం అయ్యింది. బ్రెయిన్ ఆపరేషన్ చేయాల్సి ఉండగా కుటుంబ సభ్యులు నిరుపేదలు కావడం వల్ల వైద్యం చేయించ లేక పోయారు.

ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తున్న రమేష్ చిన్నారి దీనస్థితిని చూసి చలించిపోయాడు. ఎలాగైనా చిన్నారికి ఆపరేషన్ చేయించాలని రమేష్ అనుకున్నాడు. దీంతో వైష్ణవి ఆరోగ్య సమస్యను, కుటుంబ దీనస్థితిని వివరిస్తూ ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు. స్పందించిన తెలుగు స్టాలకు చెందిన ఎన్నారైలు, స్థానికులు, ఇతర దాతలు రూ.9 లక్షలు రూపాయలు పంపించారు. దాతల సాయంతో సర్జరీ చేయించి, మిగతా డబ్బులు బాధితురాలి పేరు మీద బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించాడు.

వైష్ణవికి సాయం చేసిన దాతలు రమేష్‌తో ఫోన్‌లో మాట్లాడి మరెవరైనా నిరుపేదలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రమేష్ ప్రతీ నెల ఓ నిరుపేద కుటుంబాన్ని ఎంపిక చేసి ఫేస్‌బుక్‌లో పోస్టు చేస్తున్నాడు. ప్రతి నెల చివరలో బాధిత కుటుంబానికి వచ్చిన విరాళాలు, వాటిని ఉపయోగించిన తీరును వివరిస్తూ ఫేస్ బుక్‌లో మరో పోస్టును అప్‌డేట్ చేస్తాడు.

దాతల ఔదార్యంతోనే సేవా కార్యక్రమాలు

రేణికుంట రమేష్, సామాజిక సేవకుడు, ధర్మపురి



దాతల ఔదార్యంతో పదేళ్ల నుంచి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నా. పేదరికంతో పాటు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాల నుంచి ప్రతీ నెల ఒక కుటుంబాన్ని ఎంపిక చేసి వారికి దాతల ద్వారా సాయం అందేలా చూస్తున్నా. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు, కర్ణాటక రాష్ట్రానికి చెందిన బళ్లారి మిత్రులు, జగిత్యాలకు చెందిన సత్య సాయి అభయ హస్తం సభ్యులు, హైదరాబాద్‌కు చెందిన సినీ హీరో చిరంజీవి అభిమానులు, స్థానిక దాతలు సాయం అందిస్తున్నారు. పేదలకు సాయం అందించే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నా.







జగిత్యాలలో అనారోగ్యానికి గురైన బాధిత కుటుంబానికి డిపాజిట్ బాండ్ అందజేస్తున్న ఎస్పీ అనంతశర్మ(ఫైల్), ధర్మపురికి చెందిన పేద మహిళా కుటుంబానికి విరాళాలు అందజేస్తున్న సీఐ (ఫైల్), మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తిమ్మాపూర్‌కు చెందిన పేద కుటుంబానికి ఇంటి నిర్మాణం చేసి ఇచ్చిన సామాజిక సేవకుడు రమేష్ (ఫైల్)

పచ్చదనంతో కనువిందు చేస్తున్న చెట్లు



కొడిమ్యాల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం పూడూర్ రోడ్డులో చెప్యాల క్రాస్ రోడ్డు నుంచి కొడిమ్యాలకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లు మండుటెండలో ప్రయాణికులను పచ్చదనంతో ఆకట్టుకుంటున్నాయి. నిత్యం ఈ రోడ్డుపై నుంచి ప్రయాణించే వారు కాసేపు అక్కడి ఆగి సేద తీరుతున్నారు.

కరెంటు తీగలకు కర్రలే ఊతం



వేలాడుతున్న తీగల కోసం ఏర్పాటు చేసిన కర్రలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల రామిండ్లవాడ నుంచి అక్కపల్లి గ్రామానికి వెళ్లే దారిపై విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదభరితంగా మారాయి. ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. నిత్యం రాకపోకలు సాగించే ఆయా గ్రామాల రైతులు, వాహనదారులు, ప్రజలకు కరెంటు ప్రమాదం పొంచి ఉంది. వ్యవసాయ పొలాలకు సమీపంలో ఉండడం వల్ల రైతులు కిందకు వేలాడుతున్న తీగలకు రెండు కర్రలను ఏర్పాటు చేశారు. గాలి వీచినప్పుడు కర్రలు పడిపోయి ప్రమాదం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కిందకు వేలాడుతున్న తీగలకు బిగించిన కర్రలను తొలగించి మరమ్మతులు చేయాలని రైతులు, వాహనదారులు కోరుతున్నారు.

వెళ్లొస్తాం.. అంజన్నా

జయంతి ఉత్సవాలు ముగియడంతో తిరిగి వెళ్తున్న భక్తులు

హనుమాన్ చిన్న జయంతి ఆదాయం రూ.1.67 కోట్లు



స్వామివారిని దర్శించుకొని తిరిగి వెళ్తున్న భక్తులు

మల్యాల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో జరిగిన హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు ముగిసినప్పటికీ సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. వేలాదిగా భక్తులు అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆంజనేయ స్వామి సన్నిధిలో సోమవారం నుంచి ఆర్జిత సేవలను యథావిధిగా ప్రారంభించారు. జయంతి ఉత్సవాలు ముగియడంతో ఆర్జిత సేవలు వాహనపూజలు, అభిషేకాలు, సత్యనారాయణ వ్రతాలు యథావిధిగా కొనసాగుతాయని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

● హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలకు లక్షలాది భక్తులు తరలిరాగా దేవస్థానానికి రూ.1,67,73,800 సమకూరినట్లు ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. గతేడాది చిన్న జయంతికి రూ.1,54,13,395 రాగా ఈసారి రూ.13.60లక్షలు పెరిగింది. దీక్ష విరమణల ద్వారా రూ.40,17,500 కేశ ఖండనం టికెట్ల ద్వారా రూ.11.78లక్షలు, శీఘ్ర దర్శనం ద్వారా రూ.18,61,500 ఆదాయం వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు. రూ. 81,74,600 విలువైన లడ్డూ ప్రసాదాల విక్రయాలు, రూ.15,42,200 విలువైన పులిహోర విక్రయాలు జరిగినట్లు తెలిపారు. ఇందులో లడ్డూ, పులిహోర విక్రయాలు ద్వారా వచ్చిన సొమ్ములు పూర్తి స్థాయిలో ఆదాయం కాకపోయిప్పటికీ అధికారులు ఆదాయంగా పేర్కొంటున్నారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల వచ్చినవి మినహాయిస్తే రూ.70.57లక్షలు మాత్రమే ఆదాయం వచ్చినట్లు అవుతుంది.

అగ్గి అంటుకుంటే బుగ్గే

- కానరాని ఫైర్‌సేఫ్టీ నిబంధనలు
- ఐదేళ్లలో 275 అగ్ని ప్రమాదాలు
- 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 14((ఆంధ్రజ్యోతి): ఉష్ణోగ్రతలు పెరగడంతో అగ్నిప్రమాదాలు ప్రజలను ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రజలు అగ్నిప్రమాద నివారణకు జాగ్రత్తలు పాటించాలి. అగ్నిమాపక కేంద్రాల్లో ఆధునిక యంత్రాలు ఉన్నప్పటికీ సిబ్బంది కొరత వెంటాడు తోంది. ఎక్కడా ఫైర్‌సేఫ్టీ నిబంధనలు కనిపించడం లేదు. మంటలను ఆర్పడానికి అవసరమైన నీరు దొరకడం లేదు. జిల్లాలో సోమవారం ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాలు ఈ నెల 20న ముగియనున్నాయి.

అందుబాటులో అధునాతన యంత్రాలు

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ అధునాతన యంత్రాలు ఉన్నాయి. సిబ్బంది కొరత ఉన్నది. సిరిసిల్లలో ఒక అగ్నిమాపక వాహనం, మినీ వ్యాన్, బుల్లెట్‌లు ఉన్నాయి. వేములవాడలో ఒక అగ్నిమాపక వాహనం, ఒక బుల్లెట్ మాత్రమే ఉంది. వీటితో పాటు పోర్టబుల్ పంపులు, బ్రీతింగ్ ఆపరేటర్ సెట్స్, వాటర్, ఫోమ్, పౌడర్, సిఓ2 సిలిండర్లు అందుబాటులో ఉన్నాయి. సిరిసిల్లలో ఒక ఫైర్ ఆఫీసర్, ఇద్దరు హెడ్‌కానిస్టేబుల్, ఇద్దరు డ్రైవర్‌లు, ముగ్గురు ఫైర్‌మెన్‌లు ఉన్నారు. వేములవాడలో ఒకఫైర్ ఆఫీసర్, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, ఇద్దరు డ్రైవర్‌లు, ఇద్దరు ఫైర్‌మెన్‌లు ఉన్నారు. జిల్లాలో ఎక్కడ అగ్ని ప్రమాదం సంభవించినా వెంటనే ఫోన్ నెం. 0872323 2901కు డయల్‌చేసి చెపితే వెంటనే ఫైర్ సిబ్బంది చేరుకొని మంటలను నివారించే అవకాశం ఉంది. జిల్లాలో గత ఐదు సంవత్సరాల్లో 275 అగ్ని ప్రమాదాలు జరిగాయి. దాదాపు రూ.4.61కోట్ల ఆస్తినష్టం సంభవించింది. దాదాపు 5.41కోట్ల ఆస్తులను అగ్నిమాపక సిబ్బంది సంరక్షించారు.



సిరిసిల్లలోని ఫైర్ స్టేషన్

ఇళ్లలో అగ్ని ప్రమాద సూచికలు

ప్రధానంగా ఇళ్లల్లోనే ప్రమాద సూచికలు కనిపిస్తుంటాయి. ఇళ్లల్లో ఉండే చిన్నపిల్లలు అగ్గిపెట్టెలతో ఆటలాడ టం, ఇంట్లో గ్యాస్ స్టౌ ఆన్‌చేసి మరిచిపోవడం, కిరోసిన్, పెట్రోల్‌లు ఇంట్లో నిల్వచేయడం వలన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఉదయం దీపారాధన చేసి ఇంటికి తాళం వేసి మరిచిపోతే అగ్గిరాజుకుంటుంది. దీపాలకు వేడిమి ఎక్కువై ఇల్లంతా మంటలు వ్యాప్తి చెందుతాయి. ఇళ్లల్లో విద్యుతు స్విచ్‌బోర్డులు ప్రతి ఏడాది మరమ్మతు చేయించుకోవాలి. స్విచ్‌బోర్డుల వల్ల షార్ట్‌సర్క్యూట్ సంభవిస్తుంది.



అగ్నిప్రమాదాలకు నెలవు

ఎండ తీవ్రతకు అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా గడ్డివాములు, గుడిసెలు, ఇతర వ్యర్థపదార్థాల కారణంగా ఎక్కువగా మంటలు వ్యాపిస్తాయి. వీటి సమీపంలో ఎవరైనా సిగరెట్, బీడీలు తాగి పారేసి వెలితే అగ్గిరాజుకుంటుంది. ఇవేకాకుండా పత్తి, మిరప, కంది, తదితర పంటలు కోసిన తర్వాత కట్టె కాలబెడుతుంటే మంటలు వ్యాపించే అవకాశం ఉంది. ఈ మంటలు పొలాల గట్లపై ఉన్న గడ్డివాములకు అంటుకుంటాయి. ఇవేకాకుండా అడవులు అంటుకొని కాలిపోతుంటాయి. మరోవైపు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా భవనాల్లో మంటలు వ్యాపిస్తున్నాయి.

నివారణ చర్యలు

- వంటింటి పైభాగాల్లో గాలి వెలుతురు ఉండేలా చూడాలి
- గ్యాస్‌ట్యూబ్‌ను మార్చుకోవాలి
- సిలిండర్ వాడకం పూర్తియిన వెంటనే రెగ్యులేటర్ ఆపివేయాలి
- మండుతున్న స్టౌవ్‌లో కిరోసిన్ పోయవద్దు
- వంటిగదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్ ఉంచకూడదు.
- స్కూల్, షాపింగ్ కాంప్లెక్స్, ఆస్పత్రులలో ఆర్‌సిసి కాంక్రీట్ స్లాబులనే పైకప్పుగా వాడాలి.
- ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లను అవసరమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలి.
- గడ్డివాములను నివాస గృహాలకు దూరంగా వేయాలి.

ప్రజల్లో అవగాహన కల్పిస్తాం

ఎస్. నరేందర్, ఫైర్ ఆఫీసర్, సిరిసిల్ల



జిల్లాలో అగ్నిప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పిస్తాం. వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వారం రోజుల్లో అగ్ని ప్రమాదాలు, వాటి నివారణ, నియంత్రణ చర్యలపై వివిధ రూపాల్లో ప్రదర్శనలు ఇస్తాం. పోస్టర్లు, కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తాం. ఫైర్‌స్టేషన్‌లలో ఆధునాతన యంత్రాలు ఉన్నాయి. సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించేలా చర్యలు తీసుకున్నాం.

భక్త జనసంద్రం

- వేములవాడలో భక్తుల రద్దీ
- రాజన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



వేములవాడలో బారులు తీరిన భక్తులు



ఆలయ ఆవరణలో కిక్కిరిసిన భక్తులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పుణ్యక్షేత్రం సోమవారం భక్తులతో జనసంద్రంగా మారింది. రాష్ట్రం నలు మూలల నుంచి వచ్చిన భక్తులు రాజన్నకు మొక్కులు చెల్లించకున్నారు. ధర్మ దర్శ నం, కోడెమొక్కు క్యూలైన్‌లో భక్తు లను దర్శించుకునేందుకు సుమారుగా మూడుగంటల సమయం పట్టింది. శీఘ్ర దర్శనం, బ్రేక్ దర్శనం క్యూ లైన్‌ల ద్వారా ఆలయంలోకి వెళ్లిన భక్తులు ముందుగా శ్రీలక్ష్మీగణపతిని, తరువాత రాజన్నను దర్శించుకున్నారు. తదనంతరం శ్రీ పార్వతిదేవి అమ్మవారికి ఒడిబియ్యం పోస్తూ అమ్మ వారిని వేడుకున్నారు. కోడెమొక్కును చెల్లించుకుని తరించారు. శ్రీ భీమేశ్వర, నగరేశ్వర, శ్రీబద్ది పోచమ్మ అమ్మవార్లను దర్శించుకుని తిరుగు ప్రయాణమ య్యారు. భక్తులకు ఇబ్బందులు తలేత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు శ్రావణ్‌కుమార్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అశోక్ కుమార్‌లు, సూపరిండెంట్‌లు వరి నర్సయ్య, నరేందర్, రాజేందర్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజన్నను దర్శించుకున్న ఏపీ, రాజస్థాన్, తెలంగాణ న్యాయమూర్తులు

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఏ. హరిహరనందశర్మ, రాజస్థాన్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎం. లక్ష్మణ్, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎన్. తుకరాంజీలు దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులు రాజన్న ఆలయానికి రావడంతో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఘనస్వాగతం అందించగా పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. సోమవారం ఉదయం అర్చకులు న్యాయమూర్తులకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. శ్రీస్వామి వారి ప్రత్యేక పూజ అనంతరం కోడెమొక్కు చెల్లించుకున్నారు. కాగా ఆలయ కల్యాణ మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం గావించగా ఆలయ ఈవో శ్రీస్వామి వారి శేషవస్త్రం, రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. వారి వెంట సిరిసిల్ల జిల్లా జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, స్థానిక ఎమ్మార్వో విజయ్ ప్రకాశ్‌రావు, ఏఈవో అశోక్‌కుమార్ శ్రీకాంత్‌చారి తదితరులు ఉన్నారు.



కోడెమొక్కు చెల్లించుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తులు

ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు


కోరుట్లలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్


కొడిమ్యాలలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సత్యం



జగిత్యాలలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీఎన్జీవో నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): బీఆర్ జిల్లావ్యాప్తంగా సోమవారం అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తహసీల్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

●బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు.

●తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ టీబీసీ జేఏసీ జిల్లా శాఖల ఆధ్వర్యంలో హరి అశోక్ కుమార్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

●జిల్లా కేంద్రంలోని స్థానిక టీఎన్జీవో భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో టీఎన్జీవో అధ్యక్షుడు మిర్యాల నాగేందర్, డా.శ్రీనివాస్, చంద్రయ్య పాల్గొన్నారు.

●పట్టణంలోని స్థానిక ఆర్టీసీ డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో డిపో మేనేజర్ కల్పన, ఎంఎఫ్ కవిత, ఎస్‌టీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

●పీఆర్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ బాధ్యులు బోయినిపెల్లి ఆనందరావు, ఏవీఎన్‌రాజు, భూపతిరావు పాల్గొన్నారు.

●**జగిత్యాల క్రైం:** జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్‌కుమార్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ భీమ్‌రావు, డీసీఆర్‌బీ డీఎస్పీ సురేష్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆరీఫ్‌అలీ ఖాన్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వేణు తదితరులు ఉన్నారు.

●**జగిత్యాలరూరల్:** జగిత్యాల అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాంమోహన్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. తిప్పన్నపేట, ధరూర్, రూరల్ మండలం మోరపల్లి గ్రామాల్లో అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ధరూర్‌లో మాజీ ఏఎంసీ చైర్మన్ దామోదర్‌రావు, ప్యాక్స్ వైస్ చైర్మన్ శీలం సురేందర్ పాల్గొన్నారు. మోరపల్లిలో ప్యాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

●మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా సభ్యులు అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో కౌన్సిల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు లక్కం రాజ్యలక్ష్మి, కుందారపు గంగాధర్, కుందారపు లావణ్య, కరుణ, విజయ పాల్గొన్నారు.

●**కోరుట్ల:** అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి పౌరుడు కృషి చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. సోమవారం కోరుట్ల మున్సిపల్, అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పెట బాస్కర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మానుక ప్రవీన్ కుమార్, బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్‌లతో పాటు వివిధ కుల, యువజన సంఘ నేతలు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో సీపీఐ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ మారుతి, అంబేద్కర్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

●జై భీం యూత్ ఆధ్వర్యంలో పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీని నిర్వహించారు.

●**కోరుట్ల రూరల్:** మండలంలోని మాదాపూర్‌లో మాజీ జడ్పీటీసీ సభ్యురాలు దారిశెట్టి లావణ్యా-రాజేష్, మాజీ ఎంపీపీ తోట నారాయణ ఆధ్వర్యంలో వెంకటాపూర్‌లో అంబేద్కర్‌కు నివాళులర్పించారు.

●**కోరుట్ల రూరల్ (మెట్‌పల్లి టౌన్):** పట్టణంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అంబేద్కర్ విగ్రహంకు పూలమాల వేసి నివాళి అర్పించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహంకు పూలమాల వేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ రచించిన రాజ్యాంగ పుస్తకంను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మెట్‌పల్లి డీఎస్పీ రాములతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులకు అంబేద్కర్ సంఘ నాయకులు అందించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అంబేద్కర్ విగ్రహంకు నివాళులర్పించారు. పట్టణంలోని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు.

●**కోరుట్ల రూరల్ (ఇబ్రహీంపట్నం):** మండలంలోని అన్ని గ్రామాలలో అంబేద్కర్ జయంతి వేడుకలను అంబేద్కర్ సంఘ నాయకులు ఘనంగా నిర్వహించారు. జైభీం యూత్ సభ్యులు ర్యాలీని నిర్వహించారు.

●**మెట్‌పల్లి రూరల్:** అంబేద్కర్ వల్లే అన్ని వర్గాల పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని మాజీ జడ్పీటీసీ కాటిపల్లి రాధ-శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దాపూర్ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి ఆమె స్థానిక దళిత నాయకులతో కలిసి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

●**ధర్మపురి:** పట్టణంలోని జాతీయ రహదారి 63 వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రజా ప్రతినిధులు, అంబేద్కర్ సంఘం, వివిధ రాజకీయ పార్టీలు, దళిత సంఘాల నేతలు అంబేద్కర్ విగ్రహానికి, చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలో, మండల వ్యాప్తంగా అంబేద్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ధర్మపురి మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మొలుగూరి రమేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య-లక్ష్మణ్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ సంగ నర్సింహులు, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అలుక వినోద్ తదితరులు పాల్గొన్నారు.

●**మల్యాల:** అంబేద్కర్ రచించిన రాజ్యాంగం స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసి అమలు చేస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బ్లాక్ చౌరస్తా వద్ద గల అంబేద్కర్ విగ్రహంకు ఎమ్మెల్యే నివాళులు అర్పించారు. అంతకు ముందు నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ మ్యాక లక్ష్మన్, ఏఎంసీ చైర్‌పర్సన్ బత్తిని మల్లీశ్వరీశ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో స్వాతి, మాజీ జడ్పీటీసీ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

●**రాయికల్:** రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాయికల్ పట్టణంలో పురపాలక సంఘం, బీఆర్ఎస్ పార్టీ, కాంగ్రెస్, బీజేపీ పట్టణ శాఖ, గోసంగి యువజన సంఘం, మండలంలోని భూపతిపూర్, కట్కాపూర్, ఇటిక్యాల, రామాజీపేట గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ మనోహర్, మేనేజర్ వెంకటి, హెల్త్ అసిస్టెంట్ సురేష్, బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్ కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్.

●**పెగడపల్లి:** మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి, మండలంలోని అన్ని గ్రామాలు, పంచాయతీ కార్యాలయాలలో ఆయన చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంబేద్కర్ జయంతోత్సవ కమిటీ నాయకులు బత్తుల ప్రదీప్, కొత్తూరి బాబు, మాజీ జడ్పీటీసీలు కాసుగంటి రాజేందర్ రావు, తోట మోహన్ రెడ్డి, సంఘాల పార్టీల నాయకులు గజ్జెల స్వామి, ఇరుగురాల ఆనందం, మేరుగు శ్రీనివాస్, ఒరుగల శ్రీనివాస్, బొమ్మెన స్వామి తదితరులు పాల్గొన్నారు.

●**కొడిమ్యాల:** మండలంలోని వివిధ గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు. మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేశారు. ఈ కార్యక్రమాల్లో అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు రవి, మల్యాల సీఐ నీలం రవి, ఎస్సై సందీప్, తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో స్వరూప పాల్గొన్నారు.

●**వెల్గటూర్:** మండలంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. వెల్గటూర్, కిషన్‌రావుపేట గ్రామాలలో అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. స్తంభంపల్లి, రాజక్కపల్లి గ్రామాలలో అంబేద్కర్ చిత్ర పటానికి నివాళిఅర్పించారు. అంబారిపేట నుంచి పైడిపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

●**కథలాపూర్:** అంబేద్కర్ జయంతి వేడుకలు మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర సామాజిక తెలంగాణ ధూంధాం కన్వీనర్ మారంపల్లి రవీందర్, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, దళిత సంఘ నేతలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

●**మల్లాపూర్:** అంబేద్కర్ జయంతిని మల్లాపూర్‌తో పాటు చిట్టాపూర్, ముత్యంపేట, మొగిలిపేట, పాత ధాంరాజుపల్లి, వివిరావుపేట గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అంబేద్కర్ సంఘ నాయకులు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

●**మేడిపల్లి:** అంబేద్కర్ జయంతి వేడుకలను మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయా కార్యకమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ వినోద్ యాదవ్, రమేష్‌రెడ్డి, దాసు, దామెర సాల్మన్, లాజర్, ఇజ్రాయిల్, శంకర్, ప్రకాష్, నాగరాజు, నర్సయ్య, రాజేష్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

●**బీర్‌పూర్:** మండలంలోని ఆయా గ్రామాలలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందిరానగర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి, తుంగూర్ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి దళిత నాయకులు, ఆయా పార్టీల నాయకులు నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల తాజా మాజీ సర్పంచ్‌లు, విద్యావేత్తలు, అంబేద్కర్ అభిమానులు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

●**సారంగాపూర్:** అంబేద్కర్ అన్ని వర్గాల ప్రజలకు స్ఫూర్తి ప్రధాత అని ఎస్సై దత్తాద్రి అన్నారు. మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు పూదారి శోభన్, నాయకులు గుర్రాల రాజేందర్‌రెడ్డి, కోంద్ర రాంచందర్‌రెడ్డి, సుధాకర్, చాతరాసి లక్ష్మీరాజం, గంగాధర్, లక్ష్మరెడి పాల్గొన్నారు.

●**బీమారం:** మండల కేంద్రంతో పాటు గోవిందారం, వెంకట్రావుపేట, రాగోజీపేట, మన్నెగూడెం, రంగాపూర్ గ్రామాల్లో అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నీరజ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. బీమారం గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన కార్యక్రమాల్లో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు దీపక్, ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి కుమారస్వామి పాల్గొన్నారు.


ధర్మపురి పట్టణంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళి


మెట్‌పల్లి మండలం పెద్దాపూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

పైసలివ్వనిదే పని జరగదు..

(5వ పేజీ తరువాయి)

రూ.5 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు.

● 2024 డిసెంబరు 16న మామిడి కర్రను తరలించడానికి పర్మిట్ కోసం రూ.4,500 లంచం తీసుకుంటుండగా జగిత్యాల డీఆర్‌వో హఫీజోద్దిన్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

ఎవరికి ఫిర్యాదు చేయాలి...?

ప్రభుత్వం నుంచి పెండింగ్ బిల్లులకు డబ్బులు డిమాండ్ చేయడం, కార్యాలయాల్లో వివిధ పనుల కోసం అధికారులు, సిబ్బంది లంచం అడిగితే 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలి. ఈ నంబరు హైదరాబాద్ ఏసీబీ కార్యాలయంలో ఉంటుంది. అక్కడి నుంచి ఉమ్మడి జిల్లాలోని ఏసీబీ డీఎస్పీ స్థాయి అధికారి లేదా కార్యాలయానికి సమాచారం అందుతుంది. నేరుగా డీఎస్పీ లేదా ఇన్‌స్పెక్టర్లకు ఫిర్యాదు చేస్తే విచారణ చేస్తారు. ఆరోపణలు నిజం అని తెలిస్తే ఫిర్యాదుదారుడి నుంచి ఏసీబీ అధికారులు డబ్బులు తీసుకొని వాటికి కెమికల్ కలిపి ఇస్తారు. ఆ డబ్బులను లంచం డిమాండ్ చేసే అధికారికి బాధితులు ఇవ్వాలని ఏసీబీ అధికారులు సూచిస్తారు. బాధితుడు సదరు అధికారి లేదా సిబ్బందికి నగదు ఇవ్వగానే ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి వారిని అదుపులోకి తీసుకుంటారు. ఫిర్యాదుదారుడు ఇచ్చిన డబ్బులు కేసు నడుస్తుండగానే 30 నుంచి 45 రోజుల్లో వాపసు వస్తుందని ఏసీబీ వర్గాలు పేర్కొంటున్నాయి.

లంచమడిగితే సమాచారమివ్వండి..

-వివి రమణమూర్తి, ఏసీబీ, డీఎస్పీ, కరీంనగర్



ప్రభుత్వ శాఖల్లో పనిచేసే అధికారులు ప్రజలను లంచం అడిగితే అవినీతి నిరోధక శాఖ అధికారులకు నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు. ఎవరైనా లంచం ఇవ్వాలని అడిగితే ఏసీబీ డీఎస్పీ సెల్ 9154388955 నంబరుకు గాని, 1064 టోల్ ఫ్రీ నంబరుకు గాని, ఏసీబీ వాట్సాప్ హెల్ప్ లైన్ 9440446106 నంబరుకు ఫిర్యాదు చేయాలి.

నేరుగా రైస్ మిల్లులకు ధాన్యం

● కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతుల ఇక్కట్లు

● మద్దతు ధర కన్నా తక్కువకు విక్రయం


కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు

మల్యాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో కొందరు రైతులు ధాన్యాన్ని నేరుగా రైస్ మిల్లులకే తరలిస్తున్నారు. పది రోజులుగా కొనుగోలు కేంద్రాలకు పెద్ద ఎత్తున్న ధాన్యం వచ్చి చేరగా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ మార్పులతో ఆందోళన చెందుతున్నారు. దళారుల బెడద తగ్గించడానికి మద్దతు ధర అందించడానికి ప్రభుత్వం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ద్వారా ఏటా ధాన్యం కొనుగోలు చేస్తోంది. కేంద్రాల వద్ద అసౌకర్యాలు, ప్రధానంగా ధాన్యం ఆరబోతకు స్థలం లేకపోవడం, తూకం అయ్యాక కోతలు విధించడం వంటి కారణాలతో అధిక సంఖ్యలో రైతులు రెండేళ్ల నుంచి కొనుగోలు కేంద్రాల పట్ల ఆసక్తి చూపడం లేదు. పంట కోతవగానే పొలాల నుంచి నేరుగా రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో దళారులు కొనుగోలు చేస్తుండగా మరి కొన్ని చోట్ల రైతులే మిల్లర్లకు విక్రయిస్తున్నారు.

● అసౌకర్యలతో మిల్లులకు

కొనుగోలు కేంద్రాలలో ఎదుర్కొంటున్న అసౌకర్యాలే ధాన్యం మిల్లులకు తరలించేలా చేస్తున్నాయని పలువురు రైతులు అభిప్రాయ పడుతున్నారు. సాగు చేయడం కన్నా పండించిన ధాన్యం విక్రయించడమే అన్నదా తలకు సవాలుగా మారుతోంది. ఆరబోసి, శుద్ధి చేసి నాణ్యమైన ధాన్యం తూకానికి రోజుల తరబడి వేచి ఉండడం.. తూకం అయ్యాక మిల్లర్లు తీసుకోవడం లేదంటూ క్వింటాల్‌కు 4-5 కిలోలలోపు తరుగు పేరిట కోతలు విధించడం గతంలో చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం అకాల వర్షాలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. తేమ శాతం వచ్చి రోజులు గడిచినా తూకం వేయక పోవడం, వాటి డబ్బులు రావడానికి మరో నెల రోజులు గడవడం, ధాన్యం పోసుకోవడానికి కొనుగోలు కేంద్రాల్లో స్థలం లేకపోవడం రైతులు మిల్లులకు వెళ్లడానికి కారణంగా పలువురు పేర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వం రైతులకు ఏ గ్రేడ్ క్వింటాల్ ధాన్యానికి రూ.2300 వరకు చెల్లిస్తోంది. దళారులు, మిల్లర్లు క్వింటాల్‌కు రూ.1800నుంచి రూ.1900వరకు చెల్లిస్తుండడంతో ఆరబోయడం, శుద్ధి చేయడం, రోజుల తరబడి కాపల, వేచి ఉండడం వంటి ఇబ్బందులు ఉండవని మిల్లుల వైపు మొగ్గు చూపుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికైన త్వరితగతిన కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

పోషకాహారంతో చిన్నారులకు ఆరోగ్యం

కథలాపూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకుంటేనే చిన్నారుల ఆరోగ్యం బాగుంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షైమదీబేగం పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గంబీర్‌పూర్‌లో పోషణ్ పక్వాడా పక్షోత్సవాల సందర్భంగా కొత్తగా చిన్నారుల నమోదుకు సంబంధించి గృహ సందర్శన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అంగన్‌వాడీ కేంద్రాల ప్రాముఖ్యతను వివరించారు. పౌష్టికాహారం అందించే వివిధ రకాల పండ్లు, కూరగాయల పోస్టర్లను చిన్నారుల తల్లిదండ్రుల ముందు ప్రదర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు శారద, వసంత, నీరజ, మణెమ్మ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి


ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్

కథలాపూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధరకు అమ్ముకోవాలని ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి కోరారు. సోమవారం మండలంలోని తక్కళ్లపల్లి, సిరికొండ గ్రామాల్లో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్రాల్లో ఏ గ్రేడ్ రకానికి రూ.2320, కామన్ రకానికి రూ.2300 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర అందిస్తోందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ జీవన్‌రెడ్డి, పీసీసీ కార్యవర్గ సభ్యుడు అంజయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి నాగరాజు, ఏఎంసీ డైరెక్టర్లు విజయ్, వాకిటి రాజరెడ్డి, వర్ధినేని లింగారావు, అల్లకొండ లింగంగౌడ్, సత్యనారాయణ, మ్యాదరవేని రాజు, సీఈఓ రాంప్రసాద్, రైతులు ఉన్నారు.

'అందరి సహకారంతోనే ఉత్సవాలు విజయవంతం'


ఎస్పీకి స్వామివారి ప్రసాదాన్ని అందజేస్తున్న ఈవో

జగిత్యాల క్రైం, ఏప్రిల్14 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతోనే కొండగట్టు చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలు విజయవంతమైనట్లు ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానంలో చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా, శాంతియుతంగా నిర్వహించిన సందర్భంగా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు సోమవారం ఎస్పీ అశోక్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను, చిత్ర పటాన్ని అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జయంతి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేలా కృషి చేసిన వివిధ జిల్లాల పోలీస్ అధికారులకు, స్పిబందికి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్, మల్యాల సీఐ రవి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆరీఫ్‌అలీ ఖాన్, ఎస్సై నరేష్ తదితరులు ఉన్నారు.

విశ్వశాంతిలో వీడ్కోలు హంగామా


పాల్గొన్న విద్యార్థులు

కోరుట్ల, ఏప్రిల్14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో సోమవారం తొమ్మిదవ తరగతి విద్యార్థులు పదోతరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశం అలరింపజేసింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాడెంట్ బ్రహ్మన్నగారి శంకర్ శర్మ, ప్రధాన వక్త బట్టు హరికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్, డైరెక్టర్ పాలెపు రామకృష్ణ, చీటి సత్యంరావు, గంగిశెట్టి కృష్ణ, కటుకం రాజేష్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో విషు పూజ


ధర్మపురిలో స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం ఘనంగా విషు పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ నిర్మాతలు భీమనాతి అశోక్-మంగ దంపతులతో నిర్మించిన ఆలయంలో ఉదయం గురుస్వామి పెండ్యాల బాలకృష్ణ ఆధ్వర్యంలో రుత్వికులు పెండ్యాల రాజేష్‌శర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మూల విరాట్‌కు అభి షేకం, ప్రత్యేక పూజలు, హారతి, తీర్థ ప్రసాద వితరణ జరిపారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. రుత్వికులు కశొజ్జుల రాజేష్‌శర్మ, ఒజ్జల లక్ష్మణ్, ఆశెట్టి శ్రీనివాస్, గుడ్ల రవీందర్, పులి రవీందర్, జనార్ధన్‌షిండే, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

●మల్యాల: మల్యాల మండల కేంద్రంలోని హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో విషు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృత అబిషేకం, చందనాబిషేకం చేశారు. మిట్టపల్లి లక్ష్మినారాయణ, గుండేటి మోహన్, గంగాధర్, రాంమోహన్, మల్లేశం పాల్గొన్నారు.